క్లుప్తంగా

చురుగ్గా వేంకటేశ్వర ఆలయ నిర్మాణం



ఆలయ గుమ్మం ముహూర్త పూజలో కొప్పిశెట్టి దంపతులు

కాకినాడ రూరల్: మండలంలోని చీడిగలో దశావతార వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం చురుగ్గా సాగుతోంది. గ్రామస్తుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, దాతల సహకారంతో సుమారు రూ.2 కోట్లతో శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మిస్తున్నారు. రాజగోపురానికి వైఎస్సార్ సీపీ నాయకుడు కొప్పిశెట్టి గణేష్ తన తండ్రి, మాజీ ఎంపీపీ కొప్పిశెట్టి రవీంద్రనాథ్ ప్రసాద్ జ్ఞాపకార్థం రూ.15లక్షలు విరాళంగా ఇచ్చారు. గణేష్ దంపతులు గుమ్మం మూహూర్తం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

ఉప్పాలమ్మతల్లి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం



ఉప్పాలమ్మ ఆలయంవద్ద నిర్వహిస్తున్న యాగాలు

కరప: గ్రామదేవత ఉప్పాలమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణం, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా శుక్రవారం అమ్మవారి మూలవిరాట్, ద్వారపాలకుల విగ్రహాలకు, కలశాలకు క్షీరాభిషేకం చేశారు. యాగశాలలో బ్రహ్మశ్రీ పి.సత్యనారాయణశాస్త్రి ఆధ్వర్యంలో జలాధివాస బింబోద్వాసన, విఘ్నేశ్వర పూజాదికం, సోమకుంభాది అవాహన, మూలమంత్ర హోమాలు, క్షీరాభిషేకం, దిగ్దేవతా బలిహరణం, ధాన్యాధివాసాంగహోమం తదితర పూజలు జరిపించారు. అమ్మవారి పుట్టింటివంశీయులు చోడపునీడి వెంకటరమణ, ప్రభావతి, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సత్తిబాబు, శివాలయం కమిటీ మాజీ చైర్మన్ చొల్లంగి దుర్గారావు, ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ చిన్నారి మురళి దంపతులు పూజల్లో పీటలపై కూర్చున్నారు.

ఉపాధ్యాయుల అక్రమ అరెస్టులు తగదు

కాకినాడ సిటీ: సీపీఎస్ రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ ఖండించారు. శుక్రవారం సుందరయ్యభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రశాంతంగా సంకల్ప దీక్షలు నిర్వహించకుండా ఎక్కడికక్కడ అరెస్టులు చేయడం శోచనీయమని రాజశేఖర్ అన్నారు.

పార్కింగ్ షెడ్‌కు భూమి పూజ



పార్కింగ్ షెడ్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు

కాకినాడ క్రైం: కాకినాడలోని ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో వాహనాల పార్కింగ్ షెడ్ నిర్మాణానికి ఎస్పీ రవీంద్రనాథ్ బాబు శుక్రవారం భూమి పూజ చేశారు. సిబ్బంది వాహనాలకు దీనిని ఉపయోగించనున్నట్లు తెలిపారు.

నేడు కుంతీమాధవస్వామి రథోత్సవం

పిఠాపురం: కుంతీమాధవ కల్యాణోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శుక్రవారం పొన్న వాహనంపై గ్రామోత్సవం నిర్వహించగా పలువురు భక్తులు స్వామివార్ని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్వామి వారి దివ్య రథోత్సవం శనివారం రాత్రి నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఐదు రోజులుగా విశేష అలంకారంలలో స్వామి వారు భక్తులకు దర్శనమిస్తున్నారు. కల్యాణం సందర్భంగా విశేష ఆభరణాలతో స్వామి కొలువై ఉన్నారు.

వృద్ధులకు పాదరక్షల పంపిణీ



వృద్ధులకు పాదరక్షలను పంపిణీ చేస్తున్న రత్నప్రసాద్ తదితరులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధులకు శుక్రవారం పాదరక్షలు పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్, ఆధ్యాత్మికవేత్త రవిశంకర్ పట్నాయక్, రేలంగి బాపిరాజు, రాఘవరావు, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఆదర్శం నాయకర్

- చారిటీస్ చైర్మన్ కార్తీక్ నాయకర్
- ఘనంగా విద్యాదాత వర్ధంతి



మల్లాడి సత్యలింగం నాయకర్ వర్ధంతి సభలో పాల్గొన్న నాయకులు, అధికారులు

కాకినాడ సిటీ: మహాదాత మల్లాడి సత్యలింగం నాయకర్ వర్ధంతిని శుక్రవారం ఎంఎస్ఎన్ చారిటీస్‌లో నిర్వహించారు. 2500 మంది విద్యార్థులు, స్థానికులు, పెద్దలు పాల్గొన్నారు. సభకు చారిటీస్ చైర్మన్, వ్యవస్థాపక ధర్మకర్త మల్లాడి కార్తీక్ నాయకర్ మాట్లాడుతూ అందరి సహకారంతో సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ఎం.విజయరాజు మాట్లాడుతూ అందరికీ ఆదర్శం విద్యాదాత నాయకర్ అన్నారు. కొడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళ మాట్లాడుతూ 107 ఏళ్లుగా విద్యను అందిస్తున్న గొప్ప సంస్థ అని కొనియాడారు. మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ సుంకర శివప్రసన్న మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నాయకర్ ఆశయ సాధనకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. 22, 23వ వార్డుల మాజీ కార్పొరేటర్లు మీసాల శ్రీదేవి, ఎంజీకే కిశోర్‌కుమార్ మాట్లాడుతూ సంస్థ అభివృద్ధి మా బాధ్యత అని, పాఠశాలలకు వెళ్లే రహదారి నిర్మాణం ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో జరిగిందని, ఆటస్థలం, ప్రహరీ నిర్మాణాలకు సహకరిస్తామన్నారు. కార్యనిర్వాహణాధికారి పి.బాబూరావు, అధికారులు పి నారాయణమూర్తి, కర్రి నారాయణరావు, పద్మశ్రీ, ప్రిన్సిపాళ్లు కె.అమరేశ్వరరావు, ఎస్.విజకుమారి, హెచ్ఎం ఎంఎస్ సుబ్రహ్మణ్యం, బి.గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

తూరంగిలో..

రూరల్ మండలం తూరంగి రాఘవేంద్రపురంలో మల్లాడి సత్యలింగం నాయకర్ సంక్షేమ సంఘం నాయకర్ వర్ధంతిని నిర్వహించింది. పేదలకు నూతన వస్త్రాలు, దుప్పట్లు, చీరలు, పంచెలు పంచారు. సుమారు 300 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు. తూరంగి మాజీ సర్పంచ్ బలగం ప్రసన్నకుమార్, టీడీపీ నాయకులు పిల్లి అనంతలక్ష్మి, పిల్లి సత్యనారాయణమూర్తి, వనమాడి వెంకటేశ్వరరావు, బొజ్జా సాంబశివరావు, సంఘం నాయకులు పెమ్మాడి శ్రీను, గరికిన పెద్దరాజు, కర్రి గంగాచలం, సబ్బతి ఫణీశ్వరరావు, ఆతం భద్రం తదితరులు నాయకర్ విగ్రహానికి నివాళులర్పించారు.

పండూరు అభివృద్ధికి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- గ్రామంలో గడప గడపకూ నిర్వహణ



పండూరు గ్రామంలో లబ్ధిదారుకు పథకాల బ్రోచర్‌ను అందజేసిన ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: పండూరు గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నట్లు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే కురసాల రామాలయం వీధి, వేణుగోపాలస్వామి వీధి, ఎస్సీపేట ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు రహదారి సమస్య చెప్పగా అక్కడికక్కడే పరిష్కరించారు. రాష్ట్రంలో సీఎం జగన్ సంక్షేమ ప్రభుత్వాన్ని కొనసాగిస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా పార్టీలకు అతీతంగా పథకాలను వర్తింపచేస్తున్నారన్నారు. గ్రామంలో ప్రజలకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలను కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉపసర్పంచ్ ఉలవల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ నందిపాటి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు నందిపాటి సత్తిబాబు, నందిపాటి అజయ్, ధర్మరాజు, ఆదినారాయణ, గరగ పెదకాపు, వెంకటేశ్వరరావు, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సత్తిబాబు, బావిశెట్టి వెంకటేశ్వరరావు, సానా వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, మండల సీనియర్ నాయకుడు గోపిశెట్టి బాబ్జీ, జాన్ ప్రభాకర్, తోటకూర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను తక్షణం పరిష్కరించాలి

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- విద్యుత్ అధికారులు, సర్పంచ్‌లు ఎంపీటీసీలు, కార్యదర్శులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు తదితరులు

కాకినాడ రూరల్: వేసవి సమీపిస్తున్నందున గ్రామాలలో తాగునీటి ఎద్దడి రాకుండా విద్యుత్ సరఫరా మెరుగ్గా ఇవ్వడంతో పాటు విద్యుత్ సంబంధిత సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కోరారు. కాకినాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గంలోని విద్యుత్ శాఖ అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్షించారు. రెండు ప్రాధాన్య అంశాలుగా సమావేశం ఏర్పాటు చేశామని, వేసవిలో అంతరాయం లేని, నాణ్యమైన విద్యుత్ సరఫరా, గడపగడపకూ వెళ్లినప్పుడు వచ్చిన విద్యుత్ సమస్యల పరిష్కారం అని ఆయన పేర్కొన్నారు. ఈపీడీసీఎల్ ఈఈ ప్రసాద్ మాట్లాడుతూ గడపగడపలో చెప్పిన చాలా సమస్యలను పరిష్కరించామన్నారు. మరికొన్ని పనులు సాగుతున్నాయని అన్నారు. అనంతరం గ్రామాల వారీ సమస్యలను చెప్పాలని ఎమ్మెల్యే కోరగా సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు సమస్యలు వివరించారు. వాటిని సత్వరం పరిష్కరించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. జెడ్పీటీసీ నారాయణమూర్తి, గోపుశెట్టి బాబ్జీ, డీఎల్‌డీఓ నారాయణమూర్తి, కరప ఎంపీడీఓ స్వప్న, ఈఓ పీఆర్ అండ్ ఆర్డీ బాలాజీ, ఈపీడీసీఎల్ డీఈలు శ్రీనివాస్, విష్ణుమూర్తి, ఏఈలు ఆదినారాయణరావు, శ్రీనివాసరావు, ప్రసాద్, ఈశ్వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా సేవలు అందించాలి



డీపీఆర్వో కార్యాలయాన్ని తనిఖీ చేసిన అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్

కాకినాడ సిటీ: ప్రభుత్వ పథకాల సమాచారాన్ని ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరవేసి, వాటిని లక్షిత వర్గాలు సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలని అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ అన్నారు. శుక్రవారం ఆయన రామారావుపేట శేషగిరిరావువీధిలోని జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి కార్యాలయాన్ని సందర్శించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల సమాచారాన్ని డీపీఆర్వోను అడిగి తెలుసుకున్నారు. మీడియా సంస్థల ప్రోత్సాహం, జర్నలిస్టుల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలు, అమలు తీరును డివిజనల్ పీఆర్వో పి రవి ఆయనకు వివరించారు. సిబ్బంది విధులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా సేవలు అందించాలని కోరారు. పీఆర్వోలు కె.రవి, అజయ్, ఏవీ సూపర్‌వైజర్ ధర్మారాజు, ఏఐఈ సిద్ధాంతి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంతో ద్వారంపూడి భేటీ



సీఎం క్యాంపు కార్యాలయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలిశారు. తాడేపల్లి లోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఆయనను కలసి పలు అంశాలపై చర్చించారు. అభివృద్ధి, జిల్లా రాజకీయ పరిస్థితులు, గడప గడపకూ మన ప్రభుత్వం వంటి అంశాలపై చర్చించినట్లు ఎమ్మెల్యే ద్వారంపూడి తెలిపారు.

మిల్క్ బ్యాంకు నిర్మాణం పరిశీలన

కాకినాడ క్రైం: జీజీహెచ్‌లోని పీడియాట్రిక్స్ భవంతిలో నూతనంగా నిర్మిస్తున్న మిల్క్ బ్యాంకు నిర్మాణ పనులను శుక్రవారం సుషేణ సంస్థ డైరెక్టర్లు పరిశీలించారు. ఇదే సంస్థ దాతలిచ్చిన నిధులతో నిర్మాణం చేపడుతోంది. హైదరాబాద్ నుంచి వచ్చిన డైరెక్టర్లు తొలి దశ పనులను పరిశీలించారు. పీడియాట్రిక్స్ హెచ్‌వోడీ డాక్టర్ ఎంఎస్ రాజు ఈ కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నారు.

అన్ని వసతులతో కొమరగిరి లేఅవుట్

కాకినాడ: అన్ని వసతులు, మంచి ఉపాధి అవకాశాలతో కొమరగిరి లే అవుట్ రూపుదిద్దుకోనుందని అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు చెప్పారు. శుక్రవారం ఆయన కాకినాడ రేచర్లపేట పరిధిలోని 7ఎ, 7బి సచివాలయాల పరిధిలోని గృహనిర్మాణ లబ్ధిదారులతో సమావేశమయ్యారు. లబ్ధిదారులకు స్థలాన్ని సమకూర్చిన ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తోందన్నారు. స్థానికంగానే ఉపాధి అవకాశాలు కూడా కల్పించబోతోందని ఏడీసీ చెప్పారు. కుటీర పరిశ్రమలు, పారిశ్రామిక సంస్థలు కూడా ఇప్పటికే ముందుకు వచ్చాయని చెప్పారు. త్వరలోనే ఇక్కడ మరో టౌన్‌షిప్ అవతరించబోతుందని ఏడీసీ పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీఆర్వో మానే కృష్ణమోహన్, డివిజన్ ప్రత్యేకాధికారి చక్రవర్తి, సంబంధిత సచివాలయ కార్యదర్శులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగల అరెస్టు

కాకినాడ క్రైం: రాత్రి వేళల్లో రోడ్లపై నడుస్తూ ఫోన్ మాట్లాడే వారి చేతి నుంచి సెల్‌ఫోన్లు లాక్కుని వెళ్లిపోతున్న దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. కాకినాడ స్వామినగర్‌కు చెందిన 21 ఏళ్ల షేక్ నాగూర్, పర్లోవపేటకు చెందిన 22 ఏళ్ల పొట్టి చిన్నయ్య నుంచి ఏడు సెల్ ఫోన్లను, ఇంద్రపాలేనికి చెందిన 20 ఏళ్ల రాలి మహేష్ విష్ణు, 21 ఏళ్ల సమ్మంగి నవీన్‌కుమార్ నుంచి ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ ఎస్.రాంబాబు తెలిపారు. వ్యసనాలకు బానిసలై వరుస దొంగతనాలకు పాల్పడ్డారని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీసీఎస్ ఎస్ఐ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో నిఘా పెట్టి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. సెల్‌ఫోన్ల విలువ సుమారు రూ.1.5 లక్షలని, నిందితులను శుక్రవారం జైలుకు తరలించినట్టు తెలిపారు.

ఏపీ జేఏసీ అమరావతి కాకినాడ జిల్లా కార్యవర్గం



జిల్లా అధ్యక్షుడు త్రినాథరావు



ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్

కాకినాడ సిటీ: ఏపీ జేఏసీ అమరావతి కాకినాడ జిల్లా సర్వసభ్య సమావేశం శుక్రవారం స్థానిక రెవెన్యూ అసోసియేషన్ భవనంలో నిర్వహించారు. జిల్లాలోని 31 సభ్య సంఘాల ప్రతినిధులు హాజరై కాకినాడ జిల్లా యూనిట్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం చైర్మన్‌గా మూడో సారి పితాని త్రినాథరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జనరల్ సెక్రటరీగా ఎస్‌వీఎస్ఎస్ఎస్ఆర్‌కే దుర్గాప్రసాద్‌ను రెండో సారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు అసోసియేట్ చైర్మన్‌గా పి.సత్యానందం, ట్రెజరర్‌గా పి.పుల్లయ్య, వైస్ చైర్మన్లుగా ఈ సతీష్‌కుమార్, ఎంబీ మోహన్‌రెడ్డి, కె.పద్మనాభంలను, ఇతర సంఘాల నుంచి మిగిలిన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. పూర్వపు సర్వసభ్య సమావేశం అనంతరం జరిగిన పరిణామాలపై సమావేశం చర్చించింది. ఐదో తేదీన కర్నూల్‌లో జరుగుతున్న ఏపీ జేఏసీ అమరావతి మూడో జనరల్ కౌన్సిల్ సమావేశానికి అధిక సంఖ్యలో సభ్యులు హాజరు కావాలని సమావేశం తీర్మానించింది.

హెల్మెట్ ధారణపై అవగాహన



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు



పండూరు జంక్షన్‌లో విధి నిర్వహణలో సీఐ శ్రీనివాస్, ఎస్సై నాగార్జునరాజు

కాకినాడ క్రైం: హెల్మెట్ ధారణపై జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ కాకినాడలోని సర్పవరం కూడలి నుంచి భానుగుడి వరకు కొనసాగింది. పెద్ద సంఖ్యలో పోలీస్ సిబ్బంది హెల్మెట్లు ధరించి ద్విచక్రవాహనాలు నడిపారు. భానుగుడి కూడలిలో ఎస్పీ మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు ప్రజలు తమ వంతు బాధ్యతగా హెల్మెట్లు ధరించాలని కోరారు.

యాన్యువల్ రిఫరెన్స్ కోర్స్ ప్రారంభం

కాకినాడ రూరల్: కాకినాడ మూడవ బెటాలియన్ ఏపీఎస్పీ క్యాంప్‌లో జి కంపెనీ సిబ్బందికి యాన్యువల్ రిఫరెన్స్ కోర్స్ ప్రారంభించారు. ఎస్పీ, ఎఫ్ఏసీ కమాండెంట్ ఎం.రవీంద్రనాథ్ బాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సిబ్బంది వారి కుటుంబాలకు దగ్గరగా ఉండాలన్న ఉద్దేశంతో ఈ కోర్సును అన్ని బెటాలియన్లలో మొదలుపెట్టినట్టు తెలిపారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండటానికి ఈ కోర్సు సహాయపడుతుందన్నారు. అడిషనల్ కమాండెంట్ సీహెచ్ భద్రయ్య, అడిషనల్ డీసీపీ ఎల్. అర్జున్,అసిస్టెంట్ కమాండెంట్ కె.శివ పోతురాజు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ చర్యలు

కాకినాడ రూరల్: కత్తిపూడి–పామర్రు జాతీయ రహదారిపై పండూరు జంక్షన్ వద్ద సర్కిల్ పోలీసులు శుక్రవారం రాత్రి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టారు. సీఐ శ్రీనివాస్, తిమ్మాపురం ఎస్సై నాగార్జునరాజు, సిబ్బంది హైవే కూడళ్లలో మితిమీరిన వేగంతో వచ్చే వాహనాలకు అవగాహన కల్పించారు.

ఆర్టీసీ డిపోలో రక్తదాన శిబిరం

కాకినాడ సిటీ: రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు, కాకినాడ జిల్లా ప్రజారవాణా అధికారి ఎమ్ శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ డ్రైవర్లు రహదారి నిబంధనలను తప్పనిసరిగా పాటించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారించాలన్నారు. రెడ్‌క్రాస్, రోటరీ సంస్థల ఆధ్వర్యంలో సుమారు 120 మంది ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ కామరాజు, ఆర్టీసీ వైద్యశాల డాక్టర్ వీరలక్ష్మి, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పి.బాలకృష్ణ, ఇన్‌చార్జి డిపో మేనేజర్ కిరణ్‌కుమార్, ఆర్టీసీ డిపో స్టేషన్ మేనేజర్ జి.శ్రీనివాస్, సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ప్రదక్షిణోత్సవం

కరప: మండలం యండమూరులోని సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వెంకటేశ్వర ఆలయంలో శుక్రవారం సాయంత్రం చుట్టోత్సవం (దేవాలయ ప్రదక్షిణ ఉత్సవం) భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో వచ్చి ప్రదక్షిణలు చేసి స్వామివార్లను దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. వంశపారంపర్య అర్చకుడు పెద్దింటి సీతారామం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవదాయ శాఖ ఈఓ పీవీఎస్ సూర్యనారాయణరాజు, కె.రఘు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పెద్దాపురప్పాడు శ్రీవెంకటేశ్వర కోలాట భజన మండలి కోలాటం అలరించింది.

కళా తపస్వితో అనుబంధం అజరామరం



ఘంటసాల విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న విశ్వనాథ్ తదితరులు (ఫైల్)



విశ్వనాథ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు (ఫైల్)

కాకినాడ కల్చరల్: కళా తపస్వి కాశీనాథుని విశ్వనాథ్‌కు కాకినాడతో మంచి అనుబంధం ఉంది. స్థానిక బాలత్రిపుర సుందరి ఆలయం సెంటర్‌లో సీతారామరాజు స్మారక కళావేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమర గాయకుడు ఘంటసాల కాంస్య విగ్రహావిష్కరణకు 2012, జులై 30న ఆయన కాకినాడ వచ్చారు. మరోసారి 2015 ఫిబ్రవరి 26న సూర్యకళామందిర్‌లో రిజర్వుడ్ లైన్ స్వామిఅయ్యప్ప ఆలయ కమిటీ, సరస్వతీ గానసభ తదితర సంస్థల ఆధ్వర్యంలో కళాతపస్విని ఘనంగా సత్కరించారు. అనంతరం ఆదిత్య విద్యాసంస్థ, రంగరాయ మెడికల్ కళాశాలను ఆయన సందర్శించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎంఎం పళ్లంరాజు, ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరావు, అదిత్య విద్యాసంస్థల అధినేత ఎన్.శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆయన మృతికి నగర ప్రముఖులు సంతాపం తెలిపారు.

దేవదాయశాఖలో పలువురికి పదోన్నతులు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని దేవదాయశాఖ పరిధి ఆలయాల్లో సూపరింటెంటెంట్‌గా పనిచేస్తున్న పలువురికి పదోన్నతి కల్పిస్తూ శుక్రవారం రాత్రి ఆ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. సామర్లకోట కుమారరామ భీమేశ్వరస్వామి ఆలయ సూపరింటెండెంట్ పనిచేస్తున్న వి.శ్రీనివాసరావును పిఠాపురం కుక్కుటేశ్వర స్వామి ఆలయ ఈఓగాను, ద్రాక్షారామ ఆలయ సూపరింటెండెంట్ జె.భీమశంకరంను సర్పవరం భావనారాయణస్వామి ఆలయ ఈఓగా, వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ సూపరింటెండెంట్ ఎం.రాధాకృష్ణను రావులపాలెం మండలం పొడగట్లపల్లిలోని ఉప్పలపాటి జానకీయమ్మ అన్నదాన సత్రం ఈఓగా నియమించారు.

6న వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ: వికాస కార్యాలయంలో ఆరో తేదీ సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ పీడీ కె.లచ్చారావు శుక్రవారం తెలిపారు. విప్రోలో నాన్‌వాయిస్ ప్రాసెస్, హోమ్ కంఫర్ట్స్ ఫర్నిచర్‌లో అకౌంట్స్, సూపర్‌వైజర్, కేపిటల్ కన్సల్టెన్సీలో టెలి కాలర్స్, నిట్ (ఐసీఐసీఐ) బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్, డెక్కన్ కెమికల్స్‌లో ట్రైనీ, హోండాయ్ మోబీస్‌లో టెక్నీషియన్, హీల్ మై ఫ్యామిలీ హెల్త్‌కేర్ సర్వీసెస్‌లో కేర్ టేకర్స్, హెల్ప్ యువర్‌నీడ్స్.కామ్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే డీయూజీకేవై స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నారు. ఎస్ఎస్‌సీ నుంచి పీజీ వరకు ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తిగల వారు వికాస కార్యాలయం వద్ద ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్లు, జెరాక్స్‌లతో హాజరు కావచ్చని పీడీ వివరించారు.

ఘనంగా అలుగుల సంబరం



సంబరంలో బుగ్గలకు శూలాలు గుచ్చుకున్న భక్తులు

కరప: మండలంలోని గొర్రిపూడిలో శుక్రవారం అలుగుల సంబరం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని కరికాల భక్తులు ఈ సంబరాన్ని ఐదు దశాబ్దాలుగా చేస్తున్నారు. ఏటా భీష్మ ఏకాదశి రోజున బసవేశ్వరస్వామి ఆలయంలో ఈ కళ్యాణం నిర్వహిస్తారు. ఆదివారం రాత్రి ఆలయంలో పార్వతీ, పరమేశ్వరుల సంబరాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. అదేరోజు సాయంత్రం నిప్పుల గుండాన్ని తొక్కుతారు. సంతానం లేనివారు నందిని ఎత్తుకుని నిప్పుల గుండం తొక్కితే సంతానం కలుగుతుందని స్థానికుల విశ్వాసం. ఆలయ ధర్మకర్త చప్పిడి చంద్రశేఖర్, గ్రామ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సామాజిక న్యాయానికి వ్యతిరేక బడ్జెట్

కాకినాడ సిటీ: కేంద్ర బడ్జెట్‌లో దళిత, గిరిజనులకు తీవ్ర అన్యాయం చేశారని యునైటెడ్ ఎస్సీ, ఎస్టీ ఫోరమ్ ఆందోళన వ్యక్తం చేసింది. శుక్రవారం కచేరిపేట కమ్యూనిటీ హాల్‌లో కేవీపీఎస్ ముద్రించిన డైరీని యునైటెడ్ ఎస్సీ, ఎస్టీ ఫోరం నాయకులు, కేవీపీఎస్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది దళితుల అభివృద్ధికి వ్యతిరేక బడ్జెట్ అన్నారు. బడ్జెట్‌ఓ స్కాలర్ షిప్‌లకు కోత పెట్టారని, ఉపాధి పనులకు నిధులు తగ్గించేశారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, గుడాల కృష్ణ, బచ్చల కామేశ్వరరావు తదతరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

కాకినాడ రూరల్: స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ఐడీఏ కాకినాడ శాఖ అధ్యక్షుడు వెదురుపాక సతీష్ అధ్యక్షతన శుక్రవారం క్యాన్సర్ నివారణపై డాక్టరు అడ్డాల సత్యనారాయణ అవగాహన కల్పించారు. క్యాన్సర్ నివారణకు ఆహార నియమాలతో పాటు శారీరక వ్యాయామం అవసరమన్నారు. డాక్టరు సువర్ణరాజు, అడబాల రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమెషీన్ అందజేత



మహిళకు కుట్టుమెషీన్ అందిస్తున్న బీజేపీ నాయకులు

బోట్‌క్లబ్: మహిళా ఉపాధి కోసం బీజేపీ నాయకులు శుక్రవారం కుట్టుమెషీన్ అందజేశారు. నగరానికి చెందిన శరగడ సత్తెమ్మ ఆర్థిక ఇబ్బందులను తీర్చేందుకు బీజేవైఎం కార్యదర్శి దొడ్డి వీరేంద్ర సహకారంతో కుట్టు మెషీన్ అందించారు. జిల్లా బీజేపీ అధ్యక్షులు చిలుకూరి రామ్‌కుమార్, సిటీ కో ఆర్డినేటర్ గట్టి సత్యనారాయణ, నాయకులు చెక్కా రమేష్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల ప్రచారం

కరప: మండలం యండమూరు శివారు వడ్డిపాలెం గ్రామంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి పార్టీనాయకులు, కార్యకర్తలతో ఇంటింటికీ మీఅనంతలక్ష్మి, ఇదేం కర్మ మనరాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి, ఉపసర్పంచ్ పలివెల జానకిరామయ్య తదితరులు పాల్గొన్నారు.